క్లుప్తంగా

లేపాక్షిని సందర్శించిన విశ్రాంత న్యాయమూర్తులు


రిటైర్డ్ జడ్జిలను సన్మానించిన అర్చకులు

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం మధ్యాహ్నం సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎస్ఎస్.సత్యనారాయణ, పంజాబ్, హర్యానా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆర్‌వి.రవీంద్రన్ సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, శ్రీనివాసమూర్తి తెలిపారు. గైనకాలజిస్ట్ జ్యోతి 125 మంది స్త్రీలను పరీక్షించడంతో పాటు అవసరమైన వారికి రూ.30 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారన్నారు. కంటి వైద్య నిపుణులు జింకా కృష్ణమోహన్ వంద మందిని పరీక్షించి 20 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

నాగలమడకకు పాదయాత్ర


రొద్దం నుంచి పాదయాత్ర చేస్తున్న భక్తులు

రొద్దం: శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో అర్చకుడు గిరీష్‌స్వామి సమక్షంలో భక్తులు పెద్దసంఖ్యలో కర్ణాటక రాష్ట్రం నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సన్నిధికి పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం రొద్దం పెద్దాంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం పాదయాత్రను ప్రారంభించారు.

కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

హిందూపురం టౌన్: 67వ ఉమ్మడి అనంతపురం జిల్లా స్థాయి అండర్ 14, 17, 19 స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీలు అనంతపురంలోని అశోక్ నగర్‌లో ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నేహా, లిఖిత, తేజస్విని, గ్రీష్మ, యాసిని, రియాజ్, సయ్యద్, శ్రీచరణ్, కార్తీక్, శోభన్, లోకేష్, హరీష్, ధనుంజయ, ధనుష్‌లు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే భావన, మంజుశ్రీ, వేణుతేజ, ఆఫ్రిద్, జితేంద్ర, ప్రణీత్, హిమనిలు ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకులు

చిలమత్తూరు: వాల్మీకి జయంతిని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలో రామాలయంలో వాల్మీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వాల్మీకి ప్రతిమను మండల కేంద్రంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి , సర్పంచ్ సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండల పరిధిలోని ఆలుడి గ్రామంలో వాల్మీకులు ఆదివారం ఘనంగా వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటాన్నికి వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

సత్యసాయి చిత్రపటం ఊరేగింపు



మడకశిర: పట్టణంలో ఆదివారం పుట్టపర్తి సత్యసాయిబాబా అవతరణ దినోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజన మండలి, సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పట్టణంలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

హోయి.. వే !

- నేషనల్ హైవే నిర్మాణంతో ప్రజలకు తొలగిన కష్టాలు
- పరిగి మండలంలో రెండు బ్రిడ్జిల నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పరిగి: మండలంలోని రెండు నదులపై వంతెనల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఇందులో సేవా మందిరం వద్ద ఉన్న పెన్నా నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జ్ దాదాపుగా పూర్తి కాగా చిన్న చిన్న పనులు మిగిలాయి. అలాగే పరిగి వద్ద ఉన్న జయమంగళీ నదిపై వంతెన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

నేషనల్ హైవేతో అనుసంధానం

హిందూపురం వైపు నుంచి మడకశిర, అమరాపురం, కర్ణాటక ప్రాంతాలైన పావగడ, చిత్రదుర్గం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గతంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈరోడ్డును జాతీయ రహదారిగా మార్చి, విస్తరించడానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. ఇందుకోసం నేషనల్ హైవే 544ఈఈతో అనుసంధానిస్తూ కొడికొండ చెక్‌పోస్టు నుంచి లేపాక్షి, చోళసముద్రం, కొల్లకుంట మీదుగా పరిగి మండలంలోని ధనాపురంతో కలుపుకుని మడకశిర మీదుగా కర్ణాటకలోని శిర వరకూ గతంలో నేషనల్ హైవేను నిర్మించారు. దీనికి అనుసంధానంగా పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ నుంచి లేపాక్షి మండలంలోని చోళసముద్రం వరకూ జాతీయ రహదారిని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తయ్యాయి. ఇందులో భాగంగా గతంలో పెన్నా, జయమంగళీ నదులపై ఉన్న సింగల్ లేన్ నిర్మాణ బ్రిడ్జ్‌లకు అనుసంధానంగా డబుల్ లేన్‌తో కొత్తగా బ్రిడ్జ్‌లను నిర్మిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులతో పాటూ బ్రిడ్జ్‌ల నిర్మాణాలు పూర్తయితే ప్రయాణికులకు ఏ ఇబ్బంది ఉండదు.

శరవేగంగా పరిగి బ్రిడ్జ్ పనులు

పరిగి మండల కేంద్రంలోని జయమంగళీ నదిపై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో సింగిల్ లేన్ బ్రిడ్జ్‌కు అనుసంధానంగా మరో బ్రిడ్జ్‌ను రెండు లేన్లతో నిర్మిస్తున్నారు. దాదాపు 250 మీటర్ల పొడవైన ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.11.39 కోట్లను వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరో రెండు నెలల్లో ఇది పూర్తి అవుతుందని అంటున్నారు.


పరిగిలో జయమంగళి నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి


సేవామందిరం వద్ద పెన్నా నదిపై నిర్మించిన కొత్త బ్రిడ్జి, ఎడమవైపున పాతబడిన కేశవ బ్రిడ్జి

రూ.86.55 కోట్లతో నిర్మాణం

పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ నుంచి హిందూపురం మీదుగా లేపాక్షి మండలంలోని చోళసముద్రం వరకూ జాతీయ రహదారి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనికోసం 20.04 కిలోమీటర్ల రోడ్డు విస్తరణతో పాటూ నిర్మాణానికి రూ.86.55 కోట్లను వెచ్చిస్తున్నారు. ఇందులో భాగంగా పెన్నా, జయమంగళీ నదులపై రెండు వంతెనలను నిర్మించడానికి చర్యలు చేపట్టగా ప్రస్తుతం హిందూపురం నుంచి సేవామందిరం, కొడిగెనహళ్లి, కాలువపల్లి క్రాస్, పరిగి మీదుగా ధనాపురం క్రాస్ వరకూ దాదాపుగా 80 శాతానికి పైగా పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నాటికి పనులు పూర్తవుతాయంటున్నారు.

సేవామందిరం బ్రిడ్జ్‌పై రాకపోకలు

నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా పెన్నా నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దాదాపు 150 మీటర్ల పొడవైన దీని నిర్మాణానికి రూ.7.10 కోట్లను ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఈనదిపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన సింగిల్ లేన్ బ్రిడ్జ్ ఉండేది. దీంతో ఎప్పుడు తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడేవి. పరిగి వైపు నుంచి హిందూపురం వైపునకు వెళ్లేందుకు ఇదొక్కటే ప్రధాన మార్గంగా ఉండేది. వేరే మార్గం లేక తరచూ ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. అయితే ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్ణాటక ప్రాంతం శిర వరకూ నిర్మించిన నేషనల్ హైవే 544ఈఈతో ప్రత్యామ్నాయ రోడ్డుతో హిందూపురం నుంచిమడకశిర, పావగడ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి తదితర ప్రాంతాలకు దోహదపడుతోంది.

ట్రాఫిక్ సమస్య లేదు



నేను బెంగళూరులో ఐటీ ఉద్యోగిని. మాది పరిగి మండలం కొడిగెనహళ్లి. గతంలో సేవామందిరంలోని కేశవ బ్రిడ్జ్‌పై తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యేది. అయితే కొత్తగా నిర్మించిన రెండు లేన్ల వంతెనతో సమస్య తీరింది.

– షబ్బీర్, ఐటీ ఉద్యోగి, కొడిగెనహళ్లి

ప్రమాదాల నివారణకు చెక్



పరిగి వైపు నుంచి హిందూపురానికి వెళ్లాలంటే రెండు బ్రిడ్జ్‌లను దాటాలి. గతంలో రెండూ ఇరుకుగా ఉండేవి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలతో ప్రమాదాలు జరిగాయి. ఈప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. రెండు లేన్లతో కొత్తగా నిర్మిస్తున్న రెండు వంతెనలతో ప్రమాదాలకు చెక్ పడినట్లే.

– సురేష్‌రెడ్డి, పరిగి

ఎమ్మెల్యేను కలిసిన ఉపాధ్యాయులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

మడకశిర: నియోజకవర్గంలోని డీఎస్సీ–98 ఎంటీఎస్ ఉపాధ్యాయులు మడకశిరలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తమకు న్యాయం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి న్యాయం చేయాలని కోరుతూ వారు ఎమ్మెల్యేకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి స్పందిస్తూ తప్పకుండా ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వారు సన్మానించారు. ఉపాధ్యాయులు చంద్రాచారి, శ్రీనివాసులు, నరసింహులు, కిష్టప్ప, శ్రీనివాసులు, పీటర్‌బాబు, రఘునాథ్, మంజునాథ్, హనుమంతరాయుడు, సంజీవయ్య తదితరులు ఉన్నారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మడకశిర: మడకశిర మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం కార్యాయలంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ప్రభాకరరావు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు సమావేశానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు.

'పురం' ప్రజలు గుర్తున్నారా బాలయ్యా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం టౌన్: ఎమ్మెల్యే బాలకృష్ణకు హిందూపురం నియోజకవర్గ ప్రజలు కనీసం గుర్తున్నారా? అని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉంటూ సినిమాలకే పరిమితమయ్యారని విమర్శించారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని చలివెందుల పంచాయతీ రాచపల్లి గ్రామంలో సర్పంచ్ ఉపేంద్రరెడ్డితో కలసి దీపిక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఆమెకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందు న్నాయా లేదా.. సమస్యలను ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందాలనే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకుని పారదర్శకంగా సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందజేస్తున్నారని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అలాంటి వ్యక్తిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడం మనందరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నటరాజ్, ఎలక్ట్రికల్ ఏఈ మహేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంతేబిదనూరు రాము, జేసీఎస్ కన్వీనర్ గిరీష్ కుమార్, వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాచపల్లి మహేంద్రనాథ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నరేష్, నాగభూషణరెడ్డి, శేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


రాచపల్లిలో సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక

సందడిగా అ'పూర్వ' సమ్మేళనం

హిందూపురం టౌన్: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 1989–90 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 34 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. చిన్ననాటి మిత్రులతో కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.


ముద్దిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

చిలమత్తూరు: మండలంలోని కోడూరు థామస్ మన్రో తోపులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఏళ్ల తర్వాత తమ స్నేహితులు, స్నేహితురాళ్లను కలుసుకోవడంతో విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి పూర్వ విద్యార్థులతో పాటు నాటి గురువులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.


కోడూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


రొళ్లలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జిలాన్

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జిలాన్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఖాదర్‌వలీ, పీడీ వన్నూరప్ప తెలిపారు. ఇటీవల జరిగిన అండర్ 17 జిల్లాస్థాయి పోటీల్లో జిలాన్ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విశ్రాంత వీఆర్ఓ మృతి


రామకృష్ణప్ప (ఫైల్)

రొద్దం: మండల కేంద్రానికి చెందిన రామక్రిష్టప్ప (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రిటైర్ వీఆర్ఓ మృతి పట్ల రెవెన్యూ అధికారులు, పలు వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పేర్లు నమోదు చేసుకోండి

పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్‌వాయిస్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణను త్వరలోనే ప్రారంభమవుతుందని కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976ను సంప్రదించాలన్నారు.

'చెకుముకి' పోస్టర్ల విడుదల

పెనుకొండ: పట్టణంలోని ఘనగిరి పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జేవీవీ నాయకులు చెకుముకి సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. జేవీవీ జిల్లా అధ్యక్షులు మహేంద్రరెడ్డి మాట్లాడుతూ పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం మండలాల్లో 8, 9, 10 తేదీల్లో పాఠశాల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహిస్తామన్నారు.

పెనుకొండపై మడకశిర జట్టు గెలుపు

మడకశిర: పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అండర్–15 బాలుర విభాగం అనంత ప్రీమియర్ (ఏపీఎల్) క్రికెట్ లీగ్ మ్యాచ్ జరిగింది. ఈమ్యాచ్‌ను స్థానిక ఎస్ఐ లోకేశ్ ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో పెనుకొండపై మడకశిర జట్టు విజయం సాధించింది.

నీటి ట్యాంకర్ బోల్తా

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లి గ్రామ సమీపంలో ఆదివారం నీటి ట్యాంకర్ బోల్తా పడింది. గ్రామంలో సురక్షిత మంచి నీటిని అన్‌లోడ్ చేసి తిరిగి సోమందేపల్లి వైపు వెళ్లే క్రమంలో మలుపు వద్ద బోల్తా పడింది. అయితే అందులో ఉన్న డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

విద్యార్థికి గాయాలు

పెనుకొండ: కొండమీద బండరాయిపై నుంచి జారి పడి పట్టణానికి చెందిన యుగంధర్ (10) అనే విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యుగంధర్ 5వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో యుగంధర్‌తో పాటు మరో 10 మంది విద్యార్థులు పెనుకొండ కొండపైకి వెళ్లారు. విద్యార్థులు ఉల్లాసంగా గడుపుతూ ఉన్న సమయంలో యుగంధర్ పెద్ద బండరాయిపైకి ఎక్కి జారిపడ్డాడు. విద్యార్థి ముఖానికి బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం పాఠశాల మైదానం సమీపంలో శనివారం రైలు కింద పడి మృతి చెందిన వ్యక్తికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి ఆచూకీ కోసం రైల్వే పోలీసులు విచారించినా అతని కోసం ఎవరూ రాలేదు. దీంతో రైల్వే పోలీస్ గిరీష్, యువకులు అఖిల్, దిలీప్, హంజీర్ పట్టణంలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలను నిర్వహించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ సొసైటీ అభివృద్ధికి కృషి

అమరాపురం: బ్రహ్మణులు ఐకమత్యంతో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అభివృద్ధికి పాటు పడదామని మూడు జిల్లాల ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ కోఆపరేటివ్ సొసైటీ మేనేజర్ బిందు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మివెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అమరాపురం, గుడిబండ మండలాల బ్రహ్మణులు మండల కార్యదర్శి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వారు చర్చించారు.

లబ్ధిదారులకు అన్ని విధాలా సాయం

చిలమత్తూరు: టేకులోడు క్రాస్‌లో జగనన్న కాలనీలో లబ్ధిదారు షాకీరా ఇంటి నిర్మాణం పూర్తి కావడంతో గృహ ప్రవేశం నిర్వహించారు. ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అతిథిగా హాజరై గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కనీసం పేదలకు స్థలం కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అన్ని విధాలా సాయం చేస్తున్నట్లు చెప్పారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేం

పెనుకొండ: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పెనుకొండ పట్టణంలోని ఖ్రమూద్దీన్ ఆలీ ట్రస్ట్ కార్యాలయంలో పోలీసులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పలువురు పోలీసులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ హుస్సేన్‌పీరా మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణలో అనేక మంది పోలీసులు మరణించడం, క్షతగాత్రులు కావడం జరుగుతోందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారి భద్రత కోసం పోలీసులు నిర్వహిస్తున్న విధులు ఎంతో విలువైనవన్నారు. పోలీస్ అమర వీరుల త్యాగాలు వృథాకావని, వారి సేవలు ఎప్పటికీ నిలిచే ఉంటాయన్నారు. రక్తదానం చేసిన పోలీసులను డీఎస్పీ ప్రశంసించారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

గుడిబండ: స్థానిక ఎస్ఐ మునిప్రతాప్ ఆధ్వర్యంలో పెనుకొండ ఎస్‌డీపీఓ ఆదేశాల మేరకు ఆదివారం పెనుకొండ ఎస్‌డీపీఓ కార్యాలయం ఆవరణలో పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. గుడిబండ మండలం నుంచి 22 మంది యువకులకు రక్తదానం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్లపై యథేచ్ఛగా పశువులు

- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు

హిందూపురం టౌన్: పట్టణంలోని రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీంతో వాహన చోదకులు తరచూ ప్రమాదాలు గురవుతున్నారు. పశువుల వల్ల తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, పశువుల ఆస్పత్రి, గురునాథ్ సర్కిల్, చర్చి రోడ్డు, మార్కెట్ ఏరియాలో ఎక్కువగా పశువులు రోడ్లపై వస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో పశువులతో సంచారంతో మరింత ఇబ్బందికరంగా మారింది. ఆవుల యజమానులు పాలు ఇవ్వకపోవడంతో ఆవులను రోడ్లపైకి విడిచి పెడుతున్నారు. దాంతో రోడ్లపై ఉన్న చెత్త కాగితాలు, ఆకులు, ప్లాస్టిక్ కవర్లను తింటున్నాయి. రాత్రి సమయంలో వీటి సంచారం అధికంగా ఉంటోందని, గుంపులు గుంపులుగా రోడ్లపైకి వచ్చి అడ్డంగా నిలుస్తున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వీటి వల్ల పెద్ద వాహనాలు సడెన్‌గా బ్రేక్ వేయడం ద్వారా వెనుక ఉన్న వాహనాలు ఢీకొని తరచూ ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. దీనికి తోడు పశువులు పోట్లాడుకుంటూ వాహనదారులు, పాదచారుల మీదికి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పట్టణంలో ప్రధాన రహదారిపైకి వచ్చిన పశువులు


రాత్రి సమయంలో వాహనాలకు అడ్డుగా...

చర్యలు తీసుకుంటాం



రోడ్లపై తిరుగుతున్న ఆవులను యజమానులు వారి ఇళ్ల వద్ద ఉంచుకోవాలని ఇప్పటికే సూచించాం. స్పందించని వారిపై యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి చర్యలు తీసుకుంటాం. రోడ్లపై తిరుగుతున్న ఆవులను గోశాలకు తరలిస్తాం.

– ప్రమోద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

నేడు విగ్రహ పునఃప్రతిష్ట

లేపాక్షి: మండల కేంద్రమైన పాత లేపాక్షిలో వెలిసిన చెరువు గంగమ్మదేవి విగ్రహాన్ని సోమవారం ఉదయం పునఃప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, పుణ్యాహం, కలశస్థాపన, నవగ్రహపూజ, పంచామృతాభిషేకం, మూల మంత్ర హోమం, నవగ్రహ శాంతి హోమం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.